నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కమాన్‌పూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటనను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్, పీఏసీఎస్ చైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు కోరారు. వారు మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ.65 లక్షలతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనంతోపాటు రూ.79 లక్షలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజలు, కాంగ్రెస్ అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కాళేశ్వరంలో బీఆర్ఎస్ నాయకుల అవినీతి



ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఇంజనీర్లు ఎంత మొత్తుకున్నా వినలేదని, కేసీఆర్ తనకు నచ్చిన విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని విమర్శించారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ సుందిళ్ల, మేడిగడ్డ, కాళేశ్వరంలో నీరు నిల్వ చేస్తే డ్యామ్‌లు కొట్టుకుపోతాయని రిపోర్టు ఇచ్చినప్పటికీ నీళ్లు ఎందుకు నిలుపడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం అవివేకమని, పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయంటూ బీఆర్ఎస్ నాయకులు సమర్థించుకోవడం బాధాకరమని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు గోదావరిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతుందంటూ కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటని, లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ నాయకులను ప్రజలే తరిమికొడతారన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా స్వామి

ఓదెల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా కనగర్తికి చెందిన కోడం స్వామి ఆదివారం నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కనగర్తిలో నిర్వహించిన మండల మహాసభలో ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శులుగా తాళ్లపల్లి రమేష్, ఆళ్లచిన్న శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ప్రకటించారు.

నెలాఖరులో 'స్థానిక' నగారా



- సన్నద్ధంగా ఉండాలని క్యాడర్‌కు టీపీసీసీ ఆదేశాలు
- 42 శాతం రిజర్వేషన్‌పై కొనసాగుతున్న ఒత్తిడి
- ఆమోదం లభించకుంటే పాత రిజర్వేషన్ల ప్రకారమే

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో నగారా మోగే అవకాశాలున్నాయి. ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని టీపీసీసీ నుంచి ఎమ్మెల్యేలు, నాయకులకు ఆదేశాలు అందినట్లు సమాచారం, రాజకీయాల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు ఆమోదం కోసం రాష్ట్రపతి చెంతకు చేరాయి. వాటిని ఆమో దించేలా ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ఢిల్లీలోనే ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ధర్నా చేశారు. పార్లమెంట్‌లో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసి పుచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన మేరకు గడువు ముంచుకు వస్తున్నది. ఆ గడువులోగానే ఎన్నికలు నిర్వహించేం దుకు ముందుకు పోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఓవైపు..42 శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికార పార్టీ సన్నద్ధం అవుతున్నది. రాజకీయాల వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో, మంత్రులతో చర్చించిన తర్వాత ఎన్నికలపై ముందుకు సాగుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు రెండు, మూడు రోజుల్లో సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మార్గాలను అన్వేషిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుక వచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధనను పక్కనబెట్టి జీఓ తీసుకరావడం, ఎన్నికలు నిర్వహించకుండా నిలువరించడం, పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించే మార్గాలను అన్వేషిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే ఆలస్యమయ్యింది. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంగా మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, ఆరు మాసాలుగా మున్సి పాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ప్రభుత్వంపై రాజకీయ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

● పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించే యోచన

రిజర్వేషన్లపై జీఓ తీసుక వస్తే ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశాలు న్నాయి. చివరగా పార్టీ పరంగా 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించి ముందుకు పోవాలని భావిస్తున్నారు. మొదట జీఓ జారీ చేసి, దాని పర్యావసానాన్ని గమనిం చిన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లో ఈ నెలాఖరు వరకు గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు

(మిగతా 8వ పేజీలో)

పాత టెండర్ విధానాన్ని కొనసాగించాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న కొంకటి లింగమూర్తి

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో 2025-26కి సరుకుల సరఫరాకు నూతన టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టారని వెంటనే దానిని నిలిపివేసి పాత టెండర్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొంకటి లింగమూర్తి మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఈ సందర్భంగా ఆదివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. కొత్త టెండర్ విధానంలో క్యాటరింగ్, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ సరఫరా చేయుటకు పాత విధానాన్ని పూర్తిగా మార్చారని, గతంలో తీసుకున్న కాంట్రాక్టర్‌లే ప్రస్తుతం సరుకులు సరఫరా చేస్తున్నారని లింగమూర్తి మంత్రికి వివరించారు. ఇప్పుడు తీసుకొచ్చిన టెండర్ విధానం ద్వారా పెద్ద పెద్ద కాంట్రాక్టర్‌కు అనుకూలంగా ఉందని, మండల యూనిట్‌గా టెండర్ వేయాలంటే ఒక కాంట్రాక్టర్ 2 లక్షల నుంచి 5 లక్షల వరకు సెక్యూరిటీ డిపాజిట్ పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. పాత విధానం అమలు చేయాలని కోరారు.

కేంద్రం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కల్లెపెల్లి అశోక్ పేర్కొన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం కల్లేపల్లి అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌పై శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కేంద్రం చట్టం చేయకపోతే బీసీ రిజర్వేషన్ల సాధనకై దేశవ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపెల్లి రవీందర్, నాయకులు జిల్లాల ప్రశాంత్, మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి నవీన్, అజయ్ పాల్గొన్నారు

గోదావరిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

గోదావరిఖని, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతంగానికి సాగునీరు, తాగునీరు అందించాలన్న మహా సంకల్పంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి గోదావరి నదిని నిండుకుండటా మార్చారని, కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిందని మాజీ ఎమ్మెల్యే చందర్ అన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణ శివారు గోదావరి నది ఇసుకలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆటలు ఆడి నిరసన తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గోదారినదిలో పడవల పోటీలు నిర్వహించామని గుర్తు చేశారు. రేవంత్ ప్రభుత్వం కేసీఆర్‌పై అక్కసుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, గాదం విజయ, బాదె అంజలి, టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవిచ నూనె కోమురయ్య, వడ్డేపల్లి శంకర్, బీఆర్ఎస్ నాయకులు అచ్చే వేణు, తోకల రమేష్, చెలకలపల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్, జక్కుల తిరుపతి పాల్గొన్నారు.



గోదావరినదిలో క్రికెట్ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మున్నూరుకాపు సంఘం కార్యవర్గ సభ్యులు

ధర్మారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం ధర్మారం గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. హనుమాన్ మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షులుగా గాండ్ల స్వామి, నార ప్రభాకర్, అధ్యక్షులుగా నార చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా సాన జయాకర్, బండారి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కదారి కుమర్, కోశాధికారిగా నార సురేందర్, సహాయ కార్యదర్శిగా నార ప్రేమ్ సాగర్, తోట శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా నార సంజీవ్‌లను ఎన్నుకోగా కార్యవర్గ సభ్యులుగా బొలిశెట్టి లక్ష్మయ్య, బండారి సాహిత్య, పుప్పాల అనుక్, బండారి మనోజ్, ఆకుల శంకరయ్య, మాదాసు శంకరయ్యలను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షునిగా చేసేందుకు సహరించిన మండల అధ్యక్షుడు గంధం మల్లయ్యకు నార చంద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



అభివృద్ధి పథంలో సుల్తానాబాద్ సహకార సంఘం

- రాష్ట్రంలో ఏ గ్రేడ్ సంఘంగా గుర్తింపు
- రుణాల పంపిణీ, రికవరీలో రాష్ట్రంలో రెండోస్థానం
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా రుణాలు

సుల్తానాబాద్, ఆగస్టు 10: (ఆంధ్రజ్యోతి): ఓ వైపు రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తూ మరో వైపు రుణాలు, విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తూ సుల్తానాబాద్ సహకార సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. సేవలు, రుణాల పంపిణీ, రికవరీలో తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. ప్రతి వ్యవసాయ సీజన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధిక ధాన్యం కొనుగోలు చేస్తుంది. 15 డిసెంబర్ 1958లో ప్రారంభమైన సంఘం తొలుత రెండు వందల మంది సభ్యులు ఉండేవారు. ప్రస్తుతం 3,4 59 మంది సభ్యులు ఉండి 2 కోట్ల 80 లక్షల 56 వేల 743 రూపాయల వాటా ధనం కలిగి ఉన్నారు. సభ్యులు ఈ సంఘంలో రూ1 కోటి యాభై లక్షల డిపాజిట్లు చేశారు.

● సంఘం పరిధిలో సూపర్ మార్కెట్

సుల్తానాబాద్ సహకార సంఘం ఆధ్వర్యంలో నాణ్యమైన నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు ఇచ్చేందుకు పది సంవత్సరాల నుంచి సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. శుద్ధ జల ప్లాంట్ నెలకొల్పి ఐదు రూపాయలకు ఇరవై లీటర్ల మంచినీటిని అందిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాట్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా బాటిల్స్ తయారీ పరిశ్రమను కూడా నెలకొల్పారు. బాట్లింగ్ యూనిట్ ద్వారా ఐఎస్ఐ మార్క్‌తో మంచినీళ్ల బాటిళ్లను మార్కెటింగ్ చేస్తున్నారు. రోడ్డు సైడ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. విత్తన శుద్ధి పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో 2,197 మంది మంది రైతుల వద్ద 1 లక్ష 55 వేల 926 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి వారికి రూ.36 కోట్ల 15 లక్షల 49 వేల రూపాయల ను చెల్లించారు. నీరుకుళ్ల గ్రామంలో సంఘంచే పెట్రోల్ బంక్ ప్రారంభించనున్నారు. రెండు కోట్లతో సహకార బ్యాంకుకు నూతన భవనం నిర్మించామని కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. సంఘం రైతుల సేవలో ముందుకు పోతోందని సీఈఓ బూర్గు సంతోష్ తెలిపారు.

● ఏటా రూ. 125 కోట్ల టర్నోవర్

వివిధ రకాల రుణాలు వ్యాపారాలు ఇతర అంశాలను కలుపుకుని ప్రతి ఏటా సంఘంలో 125 కోట్లకు పైగా వ్యాపార ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా దాదాపు 45 లక్షలకు పైగా నికర లాభం కనిపిస్తుంది. 67 సంవత్సరాల సంఘ చరిత్రలో కేవలం పదేళ్ల నుంచే ఘనసీయమైన అభివృద్ధి నమోదైంది. ఈ సీజన్‌లో సంఘం సభ్యులకు రూ 40 కోట్ల 50 లక్షల రూపాయల రుణాలు ఇచ్చారు. వీటిలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు పలు రకాల రుణాలు ఉన్నాయి. ఈ సంఘం కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలోని పార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ క్రింద పనిచేసేందుకు అర్హత పొందింది. రైతులకు గోల్డ్ లోన్స్‌ను కేవలం తొమ్మిది శాతం వడ్డీకి ఇస్తున్నారు. లాకర్స్ సదుపాయం కూడా ఉంది

ఓదెల ఆలయంలో పూజలు

ఓదెల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓదెల భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు శ్రావణమాసం పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించగా, మల్లన్నకు బోనాలను, కోడెలతో మొక్కులను సమర్పించారు. ప్రతి యేడు శ్రావణ మాసంలో భక్తులు ప్రతిరోజు అధిక సంఖ్యలో ఇక్కడికి తరలివచ్చి శ్రావణ మాసం పూజలు నిర్వహిస్తుంటారు.

కంకర పోసి వదిలేశారు

● ప్రమాదకరంగా పొత్కపల్లి రహదారి



కంకర రోడ్డు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లికి వెళ్లే రహదారిపై కంకర రోడ్డు వేసి తారు వేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వం కాల్వశ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లికి వెళ్లే దారికి డబుల్ రోడ్డుకు నిధులు మంజూరుచేయగా ఈ దారి నుంచి కంకర రోడ్డు వేసి వదిలివేశారు. దీంతో కాల్వశ్రీరాంపూర్ నుండిపొత్కపల్లి మధ్యలో ఉన్న పలు గ్రామాల ప్రజలు ఈ దారి వెంట ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నడిపించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. కంకర తేలి ఉన్న రోడ్డు కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నామని వాపోతున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి నరకం తప్పడం లేదు. కాల్వశ్రీరాంపూర్ నుంచి ఓదెల రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు చాలా మంది ప్రయాణికులు పందిల్ల నుంచి ఓదెల మండలం పెద్ద కొమిరె ద్వారా పోతుంటారు. పెద్దకొమిర వరకు కంకర తేలిన రోడ్డు కారణంగా వాహనదారులకు సరైన రోడ్డు లేకపోవడంతో పెగడపల్లి నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన ఒకరు పొత్కపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డుపై కంకర అధికంగా ఉండటంతో అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నా, అధికారుల్లో చలనం రావడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి పనులను పూర్తి చేయాలని కాల్వశ్రీరాంపూర్, ఓదెల ప్రజలు కోరుతున్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక.. తండ్రి ఆత్మహత్య


బాలేశ్వర్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బాలేశ్వర్‌రెడ్డి(52) అనేవ్యక్తి కొడుకు మరణం తట్టుకోలేక మనోవేద నతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివ రాల ప్రకారం.. గూడు బాలేశ్వర్‌రెడ్డి, మమత దంపతల కుమారుడు సంకీర్త్ క్యాన్సర్ వ్యాధితో రెండేళ్ల క్రితం చనిపోయాడు. కొడుకు మరణం తట్టుకోలేక తరుచుగా బాలేశ్వర్‌రెడ్డి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన బాలేశ్వర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బాలేశ్వర్‌రెడ్డి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

ముస్తాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ (27) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ ముస్తాబాద్‌కు ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోసుకొని వెళ్తున్నాడు. హనుమాన్ టెంపుల్ నుంచి వెళుతుండగా ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన బోర్‌వెల్ లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు మీద పార్కింగ్ చేశాడు. ఈక్రమంలో బోర్‌వేల్ లారీని నరేశ్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. నరేశ్ తలకు, కడపులో తీవ్రగాయాలుగా కాగా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టున ఎస్సై తెలిపారు.

రాజస్థాన్‌కు చెందిన వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వద్ద వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వివాహిత శారద(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వినాయకుడి విగ్రహాలు తయారుచేసేందుకు కూలగా శారద, ఆమెభర్త స్థానికంగా గదిలో ఉంటున్నారని, శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు.. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. శారద ఆత్మహత్యకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చ్యూరీగదిలో భద్రపరిచారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి శివారులో కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అతి వేగం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు గాయాలైన యువకుడిని 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మేమేమి చేశాము పాపం..

- నాలుగు నెలలుగా కళాకారులకు అందని పెన్షన్
- భారమవుతున్న కుటుంబపోషణ
- ప్రభుత్వం, నాయకులు ఆదుకోవాలని వేడుకోలు


చిందు యక్షగాన కళాకారులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): సంగీతాన్ని అందించే వాయిద్యాలు మూగ బోయాయి. తాళాలు శృతి తప్పాయి. రక్తికట్టించే గజ్జెల సవ్వడి ఆగిపోయింది.. గదలు, బా ణాలు, ఖడ్గాల విన్యాసాల గతులు తప్పాయి. నాట్యం, పాట, నాటకం, పలు కళలు ఆహార్య అభినయాలు అంతరించిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 55 సంవత్సరాలు దాటిన సుమారు 25 కళలకు చెందిన పెన్షన్‌కు అర్హులైన దాదాపు 50 నుంచి 60 మంది కళాకారులున్నారు. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యక్షగానంతో పాటు వీధి, గంటె భాగవతులు డప్పు, ఒగ్గు, బుర్ర, హరికథలు వంటి 25 కళలకు చెందిన కళాకారులకు నాలుగు నెలలుగా పెన్షన్ అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం పలువురు కళాకారులు కూలీలుగా మారారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడ్డారు. మే వరకు 3 నెలలకొకసారి 3 వేల చొప్పున పెన్షన్ ఇచ్చారు. తరువాత పెన్షన్ నిలిచిపోవడంతో కళాకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

● కళాకారుల డిమాండ్లు

ప్రభుత్వం తరుఫున కార్యక్రమాలను ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కళాకారులు కోరుతున్నారు. సంఘ భవనాన్ని నిర్మించి పెన్షన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల మంజూరు చేయాలంటున్నారు. కొత్త ప్రభుత్వం, నాయకుతోనైనా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ఆదుకోవాలి...

- గజవెల్లి కిష్టయ్య, చిందు యక్షగాన కళాకారుడు



ఒకప్పుడు మా యక్షగాన, కళా ప్రదర్శనలతో కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. ఇప్పుడు ఆదరణ కరువయింది. మమ్మల్ని ముఖ్యమంత్రి ఆదుకోవాలి.

ఆసరాగా నిలవాలి...

- ఈరు రాజమల్లయ్య, ఒగ్గు కళాకారుడు



మేం ఒగ్గు కథ చెబుతాం. కళాకారులకు సకాలంలో పెన్షన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ


ఆసుపత్రిలో రోదిస్తున్న శిశువు తల్లి ప్రేమలత, కుటుంబ సభ్యులు


మృతిచెందిన శిశువు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నవజాత శిశువు మృతిచెందింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహరాజు ప్రేమలత పురిటినొప్పులతో గురువారం జగిత్యాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం నుంచి బాబు సరిగా పాలు తాగడం లేదని విధులు నిర్వ హిస్తున్న నర్సుల వద్దకు వెళ్లితెలిపినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో శిశువు అపస్మారక స్థితి లోకివెళ్లి మృతి చెందినట్లు బంధువులు ఆరో పించారు. వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే తనబిడ్డ దక్కేవాడని తల్లి ప్రేమలత రోదిస్తూ తెలిపింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నర్సులపై చర్య తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కాగాశిశువుకు పాలు పట్టించిన తర్వాత భుజంపై వేసుకోకుండా నిద్రపుచ్చడం వల్లనే శిశువు మృతి చెందినట్లు విధుల్లో ఉన్న నర్సులు తెలిపారు.

● విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం...

నవజాతశిశువు మృతి సంఘటనపై విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ జి. కృష్ణమూర్తి తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై అతడి బంధువులు వచ్చిచెప్పినప్పటికీ విధుల్లోఉన్న వైద్యుడికి సమాచారం అందించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామస్వామి(ఫైల్)

కోనరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన కుంటెల్లి రామస్వామి(40) అనేరైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. గ్రామస్థులకథనం ప్రకారం గ్రామానికి చెందిన రామస్వామి ఉదయం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ స్టార్టర్ బావిపక్కనే ఉండడంతో కరెంటు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వెళ్లిన రామస్వామి రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో భార్య కొమురవ్వ, కుమారుడు అరవింద్ అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూసేసరికి బావిలో శవమై కనిపించాడు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ తిరుమల్ సంఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్తుల ద్వారా బయటకు తీయించి ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన కామారపు అనిల్‌కుమార్(36) ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామా రపు అనిల్‌కుమార్ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాని స్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనిల్ కుమార్ తన సన్నిహితులకు కొంతడబ్బు అప్పుగా ఇచ్చాడు. డబ్బును తిరిగి ఇవ్వాలని సన్నిహితులను కోరగా ఇవ్వకపోగా వేదింపులకు గురి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్‌కుమార్ జూలై31న అలుగునూర్ శివారులో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు అనిల్‌కుమార్‌ను చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అనిల్ కుమార్ మృతిచెందాడు. మృతుడు అనిల్‌కుమార్ తండ్రి కామారపు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మేకమల్ల ఐలయ్య అనేవ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన లచ్చయ్య కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. జుంగేని వెంకటేశ్ అనే యువకుడు వదినతో తరచూ గొడవ పడడమే కాకుండా ఆదివారం ఇంట్లోకి వచ్చి దూషిస్తూ దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయగా వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● 30 కార్ల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్లకు బిగించుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను టింట్ మీటరుతో తొలగించారు. 30కార్ల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం వాహనాల యజమానులకు కరీంనగర్ ట్రాఫిక్‌సీఐ కరీం ఉల్లాఖాన్ కౌన్సెలింగ్ నిర్వహిచారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కార్లు, ఇతర వాహనాల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ వేయొద్దన్నారు. కార్ల అద్దాలు షోరూం నుంచి వచ్చిన విధంగానే ఉండాలని, అదనపు ఫిల్మ్‌లు వేయరాదని అన్నారు. ట్రాఫిక్‌నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు, నేరఘటనలు నియంత్రించేందుకు ముందస్తుగా నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతరచర్యలకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్ఐ కుమారస్వామి, ఎస్సై ఇషాక్ అహ్మద్, ఆర్ఎస్సై సురేష్ పాల్గొన్నారు.


బ్లాక్ ఫిల్మ్ తొలగించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కరీం ఉల్లాఖాన్, ఆర్ఐ కుమారస్వామి

గ్రామాల సరిహద్దు వివాదం

- బోర్డుల తొలగింపు వివాదాస్పదం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఏళ్లుగా నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య పంచాయితీ


మల్యాల సీఐ రవికి ఫిర్యాదు చేస్తున్న రామన్నపేటవాసులు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య సరిహద్దు వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతుండగా తాజాగా ఆదివారం రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. నూకపల్లి, రామన్నపేట గ్రామాలు 1978లో ఏర్పడగా నూకపల్లి గ్రామాన్ని రెవెన్యూ పంచాయతీగా పేర్కొన్నారు. నూకపల్లి రెవెన్యూ పంచాయతీ గ్రామం కింద నూకపల్లితో పాటు రామన్నపేట చేర్చారు. ఇక్కడే రెండుగ్రామాల మధ్య పంచాయితీ ఏర్పడింది. కరీంనగర్-జగిత్యాల మార్గం దీని పరిధిలోనే ఉండగా మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి రాజారం వరకు విలువైన భూములు ఉన్నాయి. దీంతో గతంలో సర్వే నంబర్ల ఆధారంగా రెండు గ్రామాలకు కేటాయించుటకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంకు మల్యాలవైపు రామన్నపేట, నూకపల్లి వైపు నూకపల్లి గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సర్వే నంబర్ల ఆధారంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారు. అయితే తాజాగా మల్యాల క్రాస్ సమీపంలోని పెట్రోల్ పంప్ యజమాని పంప్ పక్కనే కల్యాణ మండపం నిర్మించి ఆదివారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకొని బోర్డుపై రామన్నపేటగా పేర్కొన్నాడు. దీంతో నూకపల్లి గ్రామస్థులు శనివారం అక్కడకు వెళ్లి తమ పరిధిలో ఉన్నందున రామన్నపేట గ్రామ పేరు తొలగించాలని అనడంతో ఆ పేరు తొలగించి మల్యాల క్రాస్ రోడ్డుగా పేర్కొన్నారు. రామన్నపేట పేరు తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం గ్రామస్థులు ప్రారంభోత్సవ కార్యక్రమం వద్దకు వెళ్లి యజమానితో గొడవకు దిగారు. నిర్మాణానికి తమ గ్రామపంచాయతీ అనుమతి ఉన్నందున రామన్నపేట పేరు మార్చాలని యజమాని కొత్త సురేశ్‌ను కోరారు.

తనకు రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరడంతో అక్కడ నుంచి వెళ్లారు. అంతకు ముందు బోర్డు తొలగింపుపై నూకపల్లి గ్రామస్థులపై రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. భయభ్రాంతులకు గురి చేసి బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీపంలోని సూపర్‌మార్కెట్, వీఆర్‌కే కళాశాల పేర్లు కూడా మార్చాలని నూకపల్లి గ్రామస్థులు హెచ్చరించారని రామన్నపేట వాసులు సీఐకి వివరించారు.

మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన తిప్పని శ్రావణ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జాఫర్‌ఖాన్ పేట గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ వార్డు మెంబర్ తిప్పని శ్రావణ్ గ్రామానికి మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో నిండా నీరు ఉన్నా గ్రామానికి మంచినీరు ఇవ్వక ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామస్థులు వాటర్ ట్యాంక్ దిగిరావాలని కోరగా, శాంతించిన ఆయన దిగిరావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామశివారు నుంచి మట్టిని తరలిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తరలిస్తుండగా, వాటిని సీజ్‌చేసినట్లు తహసీల్దార్ కనకయ్య తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- పెద్దఎత్తున గోనె సంచులు దగ్ధం
- రూ.30 లక్షల ఆస్తి నష్టం


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పేందుకు ఎక్స్‌కవేటర్‌తో గోడను కూల్చుతున్న సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు మూడు లక్షల గోనె సంచులు దగ్ధమై రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మార్కెట్ యార్డులోని గోదాంను సివిల్ సప్లయిస్ వారు అద్దెకు తీసుకొని 2018 సంవత్సరం నుంచి ఐదు లక్షలకు పైగా గోనె సంచులను నిలువ చేశారు. ఆదివారం ఉదయం గోదాంలో నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించి గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు భారీగా వ్యాపించడంతో జగిత్యాల, నిర్మల్, భీంగల్, కమ్మర్‌పల్లి కేంద్రాల నుంచి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పడానికి యత్నించారు. అయినా గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎల్‌సీఎస్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్‌లు ఆధ్వర్యంలో మూడు ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలుకొట్టి దగ్ధమవుతున్న గోనె సంచులను బయటకు తీసి ఆర్పి వేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తొమ్మిది గంటలపాటు శ్రమించారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత, సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ పరిశీలించారు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వచ్చే మార్కెట్ యార్డుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడంపై ఏఎంసీ అధికారుల నిర్లక్షం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.


గోదాంలో దగ్ధమవుతున్న గోనె సంచులు

పాన్‌షాప్ నిర్వాహకుడిపై జులాయిల దాడి

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షాపు ముందు సిగరెట్ తాగవద్దన్నందుకు నలుగురు జులాయిలు పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి చేసిన ఘటన ఆదివారం గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్‌లో జరిగింది. శ్యామ్ అనే పాన్‌షాపు నిర్వాహకుడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు సిగరెట్ తీసుకుని షాపువద్ద తాగుతుండగా అతడు అడ్డు చెప్పాడు. దీంతో కౌంటర్‌లోని డబ్బులు లాక్కున్న యువకులు అతనిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన ఇతర షాపుల వారిపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతూ పిడిగుద్దులు గుద్దారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గొడవ జరుగుతున్నా స్థానికులు స్పందించలేదు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని గొడవకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్ఎండీ పోలీసులు పట్టుకున్నారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌లోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అలుగునూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో గల మోయతుమ్మెద వాగు నుంచి సైతం అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను కొత్తపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాజమానులు తాళ్ల సంతోష్, గుంటక రాజు, డ్రైవర్లు తాళ్ల ప్రశాంత్, న్యాలం చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి శివారులో చిరుత పులి సంచారం

● అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ అధికారులు


ధర్మపురి శివారులో గల పోచం పుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి పాద ముద్రల కొలతలు తీస్తున్న అటవీ శాఖ అధికారులు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల పోచంపుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. రెండు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లిన ఒక వ్యక్తికి చిరుత పులి పిల్ల కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. పట్టణ శివారులో గల పోచంపంపు, ఇతరత్రా వ్యవసాయ భూములకు పెట్రోల్ బంక్ పక్క నుంచి ఎడ్ల బండ్ల దారి, కమలాపూర్ దారి గుండా నిత్యం అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తికి చిరుత పులి కనిపించడంతో స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆదివారం పరిసర ప్రాంతాల్లో కాళ్ల పాద ముద్రల కొలతలు తీసి చిరుత పులి అడుగులుగా భావిస్తున్నట్లు తెలిపారు. పోచంపంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచరించినట్లు కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు నేరెళ్ల అటవీ బీట్ అధికారి జీవన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం వెళ్లి చిరుత పులి సంచరించిన ప్రదేశాల్లో కాళ్ల వేలి ముద్రల కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆయన అన్నారు. సాయంత్రం 4 గంటల లోపుగా పనులు ముగించుకుని రైతులు, వ్యవసాయ కూలీలు తిరిగి ఇంటికి రావాలని ఆయన సూచించారు.

ప్రకృతి రమణీయంగా.. కొండలరాయుడి కోట..




కొండలరాయుడి కోట



రాతి కట్టడాలలో కొలను

● కొండగట్టులో భక్తులను ఆకట్టుకుంటున్న రాతి కొండ

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి వెనకాల వాయువ్యం వైపున ఎత్తయిన గుట్టలు, పచ్చని చెట్లు, చుట్టూ ప్రకృతి రమణీయత మధ్య గల కొండలరాయుడి రాతి కోట చారిత్రాత్మకమైంది. వందల ఏళ్ల చరిత్ర గల ఈ రాతి కోటను మల్యాల మండలం మానాలకు చెందిన బల్మూరి కొండలరాయుడు నిర్మించాడని చరిత్రకారులు చెబుతారు. వివాహమైన చాలా కాలం తర్వాత దంపతులకు అంజన్న పుణ్యఫలంగా బల్మూరి కొండల రాయుడు జన్మించాడని స్థానికులు పేర్కొంటారు. బల్మూరి కొండలరాయుడు ఆలయం వెనకాల రాతి కోటతో పాటు నీటి కొలను నిర్మించినట్లు స్థానికులు చెబుతారు. రాతి కొండను సందర్శించే భక్తులకు బండ రాళ్లపై గుర్రపు స్వారీ చేసిన గుర్రపు అడుగుల డెక్కలు, బురుజు, కోటగోడలు, కొలను చూడవచ్చు. అంజన్న దర్శనానికి వచ్చే భక్తులు కొండలరాయుడి కొండకు వెళ్లి అక్కడి నుంచి ప్రకృతి సుందర దృశ్యాలను తిలకిస్తుంటారు. ఎత్తైన ప్రాంతంలో గల కొండలరాయుడి కోటను సందర్శించే భక్తులు అక్కడి నుంచి పచ్చని గుట్టలు, చెట్ల మధ్య గల కరీంనగర్-జగిత్యాల రహదారి, రైల్వే మార్గం, వరదకాలువ దృశ్యాలను చూస్తూ ఫొటోలు దిగుతుంటారు. కొండలరాయుడి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే చాలా మంది ప్రకృతి ప్రేమికులు వచ్చే అవకాశం ఉంది.



బండపై గుర్రపు డెక్కల గుర్తులు

ఖోఖో క్రీడాకారులు..

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

● ఉమ్మడి జిల్లాలో ఖోఖో క్రీడాభివృద్ధికి కృషి

● జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరందర్‌రెడ్డి

● ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, అందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో-ఖో పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోఉన్న క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, కావాల్సింది ప్రోత్సాహమేనని అన్నారు. నిత్య శిక్షణ, క్రమశిక్షణతో రాణిస్తే భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగే అవకాశముందన్నారు. జిల్లా ఖో-ఖో క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఖో-ఖో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖో-ఖో క్రీడలను నిర్వహించేందుకు కృషిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా చేరేందుకు క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి తెలంగాణ ఖో-ఖోఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడిజిల్లా నుంచి 130మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, 30మంది సీనియర్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అంతకుముందు సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరందర్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారత మహిళల ఖో-ఖో జట్టు కోచ్ నరేష్, కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోలీసు సీఐ కుమారస్వామి, వివిధ జిల్లాల ఖో-ఖో సంఘాల ప్రధానకార్యదర్శులు డాక్టర్ వేల్పుల కుమారస్వామి, లక్ష్మయ్య, డాక్టర్ రవీందర్, ఎస్కే మొయినుద్దీన్, సూర్యప్రకాశ్, జిల్లా పెటాఅధ్యక్ష, కార్యద ర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పెద్దపల్లి పెటా అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, వెంకటేశ్, రాజు, డాక్టర్ నవీన్, జిల్లా ఖో-ఖో సంఘంప్రతినిధులు కట్ట సంతోష్, శేఖర్, శివకుమార్, రాజబాబు, మధుసూదన్, శ్రీలత, జ్యోతి, సంధ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 28,147 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం ఆదివారం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు బాబ్లీ గేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 28,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 41.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 8,773 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, వరద కాలువకు 3వేల క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కుల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 34.658 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 5.748 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

● స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం ● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు రాజన్నకు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లించేందుకు భక్తులు సుమారుగా మూడు గంటలపాటుగా బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతి రాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకుని తరించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గండ దీపంలో నూనేపోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తెలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి చర్యలు తీసుకున్నారు.



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఆకట్టుకున్న అనువంశిక అర్చక కుటుంబాల భజన..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో గోపన్నగారి మాధవి ఆధ్వర్యంలో అనువంశిక అర్చక కుటుంబాల మహిళలు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

శ్రావణ మాసం సందర్భంగా అర్చక కుటుంబాల మహిళలు నాంపల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి తరలివెళ్లారు. స్వామివారిని దర్శించుకుని భజన చేశారు.

మనువాదంతో నరమేధం సృష్టిస్తున్నారు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ఓదెల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత్మోన్మాదం, మనువాదం, నియంతృత్వంతో అడవుల్లో నరమేధం సృష్టిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఆదివారం స్వర్గీయ ఇట్యాల వెంకటయ్య ప్రాంగణంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్ వద్ద ఆదివారం సీనాయర్ నాయకుడు ఆదిరామారావు అధ్యక్షతన సీపీఐ మండల పదవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ చెప్పినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, కూడు, గుడ్డ నీడ ప్రజలకు అందించడం లేదని తెలిపారు. నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా లాంటి ఆర్థిక నేరస్తులు వేలాదికోట్లు ఎత్తుకెళ్లి విదేశాల్లో ఉంటున్నారని అన్నారు. అలాంటివారిని దేశానికి రప్పించకుండా కర్రిగుట్టలు, దండకారణ్యంలో క్రూరమైన చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలు, మావోయిస్టులను చంపివేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు శాంతిచర్చలకు ముందుకు వచ్చినా కూడా ప్రధాని, అమిత్‌షా మొండిగా వ్యవహరించి అడవుల్లో వందలాది మందిని ఎదురు కాల్పుల పేరుతో కాల్చివేశారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఉల్లంఘించి చంపేహక్కు వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. బీసీలకు ఉపయోగపడే రిజర్వేషన్ బిల్లును ప్రధాని, గవర్నర్ అడ్డుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇందిరమ్మ కమిటీల పేరుతో పేదలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో బ్రాందీషాపుల ద్వారా రూ.25వేలకోట్ల నుంచి రూ.30వేలకోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీలో ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేని శంకర్, జిల్లాకార్యదర్శి తాండ్ర సదా నందం, డిహెచ్‌పీఎస్ రాష్ట్రనాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండలంలో మూడేళ్లపాటు కార్యక్రమాల నివేదికను కోడం స్వామి చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, కరీంనగర్ టౌన్ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి కోడం స్వామి, ఆళ్ల చిన్న శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

అలుగుపారుతున్న సింగరాయకుంట

● నిండుకుండులా పత్తికుంట చెరువు



మత్తడి దూకుతున్న సింగరాయకుంట

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరాయకుంట, పత్తికుంట చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. రహీంఖాన్‌పేట గ్రామసమీపంలోని సింగరాయకుంట నిండటం వల్ల రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లె, పండలాపురం, కందికట్కూర్ గ్రామాల సమీపం నుంచి మధ్యమానేరులోకి నీరు వెళ్తోంది. దీనితో ఈ ప్రాంతాల రైతుల బావుల్లో భూగర్భజలాలు పెరుగనున్నాయి. పత్తికుంటపల్లె గ్రామసమీపంలోని పత్తికుంట చెరువులోకి భారీగా నీరుచేరడంతో మత్తడి దూకుతోంది. చెరువులు నిండటం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎగువ మానేరుకు పెరుగుతున్న వరద

● 25 ఫీట్లకు చేరిన నీటి మట్టం

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగిపొర్లుతోంది. దీంతో వరదనీరు మానేరు జలాశయంలోకి భారీగా వస్తోంది. మొత్తం 31 ఫీట్ల సామర్థ్యం గల మానేరు నీటి మట్టం ప్రస్తుతం 25 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకేందుకు మరో 6 ఫీట్ల నీరు అవసరం ఉండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



నిండు కుండలా ఎగువ మానేరు జలాశయం

అపరిశుభ్రంగా గోదావరి తీరం

● శివుడి విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరినది వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహం చుట్టూ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా గోదావరి నదికి వందలాది మంది భక్తులు పుణ్యసాన్నాలు ఆచరించడానికి వస్తున్నారు. గోదావరి వద్ద శివుని విగ్రహాన్ని పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శివుడి విగ్రహం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి విగ్రహానికి రంగులు వేయిం చారు. కానీ విగ్రహం చుట్టూ పాలిథిన్ కవర్లు, దేవుని ఫొటోలతో పేరుకుపోయినా కార్పొరేషన్ అధికారులు తొలగించడం లేదు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు ఏర్పాటు చేసిన మెట్లు కూడా చెత్తపేరుకు పోయింది. కార్పొరేషన్ అధికారులు వంద రోజుల కార్యాచరణ కార్యక్రమాలు అంటూ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. అపరిశు భ్రంగా మారిన గోదావరినది స్నానఘట్టాలను, శివుని విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



శివుడి విగ్రహం చుట్టూ ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు



గోదావరి ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు

మల్లారపు శంకర్‌కు జాతీయ అవార్డు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లారపు శంకర్‌ను బహుజనసాహిత్యఅకాడమీ వారు మహాత్మ జ్యోతిబా పూలే జాతీయ అవార్డు 2025క ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మల్లారపు శంకర్‌కు సాహిత్య అకాడమీ జాతీయఅధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అభినందించారు. జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



మల్లారపు శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి కాసుల పంట

● మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదరణ ● రీజియన్ వ్యాప్తంగా రూ.721.35 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కాసుల పంటపండింది. పథకంతో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడం, మహిళలు పెద్దమొత్తంలో ఆర్టీసీబస్సుల్లో ప్రయాణిస్తుండడంతో సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీన మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆనాటి నుంచి నేటి వరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ ఆదరిస్తున్నారు. దీంతో సంస్థకు పెద్ద ఎత్తున లాభాలు సమకూరుతున్నాయి.

కరీంనగర్ రీజియన్‌వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖనితో కలుపుకొని 11డిపోలు ఉన్నాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌జిల్లాలో ఆర్టీసీ 244బస్సులను నడిపించి 4.83కోట్లమంది ప్రయాణికుల ద్వారా రూ. 201.82 కోట్ల రూపాయలను ఆర్జించింది. జగిత్యాలజిల్లాలో 194 బస్సులను నడిపించి 5.38 కోట్ల మంది ప్రయాణికులతో 208.62కోట్లరూపాయలు, పెద్దపల్లిజిల్లాలో 136బస్సులతో 3.59కోట్లమంది ప్రయాణికులతో 154.08కోట్ల రూపాయలు, సిరిసిల్లజిల్లాలో 111బస్సులతో 2.87కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 113.73కోట్ల రూపాయలు, సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ డిపోలో 60 బస్సులను నడిపించి 1.26 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులతో 43.11కోట్లరూపాయల ఆదాయాన్ని సంపాదించింది. మొత్తానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 745 బస్సులను నడిపించి 17.93 కోట్ల మహాలక్ష్మి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 721.35 కోట్ల రూపాయల ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అర్జించింది.

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఆదాయం
హుజూరాబాద్	64	1.37	56.07
కరీంనగర్-1	87	1.71	60.89
కరీంనగర్-2	93	1.75	84.86
జగిత్యాల	95	2.40	93.07
కోరుట్ల	51	1.52	56.66
మెట్‌పల్లి	48	1.46	58.88
గోదావరిఖని	90	2.70	105.90
మంథని	46	0.89	48.18
సిరిసిల్ల	59	1.33	56.46
వేములవాడ	52	1.54	57.27
హుస్నాబాద్	60	1.26	43.11
రీజియన్ వ్యాప్తంగా	745	17.93	721.35

నెలాఖరులో 'స్థానిక' నగారా

(5వ పేజీ తరువాయి)

కలిపి 50 శాతానికి మించకుండానే జనాభా, ఓటర్ల ప్రాతిపదికన స్థానాలను రిజర్వు చేయనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ స్థానాలకు రొటేషన్ ప్రకారమే రిజర్వు చేయనున్నారు. 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం లభించకుంటే ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ వైఖరిని ఎండగట్టాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో చేసిన 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకపోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 20 నెలల కాలంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన కులగణన సర్వే, అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులు, పంచాయతీరాజ్ చట్ట సవరణ కోసం తీసుక వచ్చిన ఆర్డినెన్స్‌ల గురించి ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు నగారా మోగే అవకాశాలున్నాయని,స్థానిక ఎన్నికలకు పార్టీ క్యాడర్ సన్నద్ధంగా ఉండాలని టీపీసీసీ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తున్నది. పెద్దపల్లి జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు, 13 మండల, జిల్లా పరిషత్ స్థానాలను, 137 ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ తహతహలాడుతోంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

● బీజేపీ జిల్లా నాయకులు మిట్టపల్లి ప్రవీణ్

సుల్తానాబాద్, ఆగస్టు 10: (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు నాయకులు సన్నద్ధం కావాలని, ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశమైన ప్రవీణ్ వారికి ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి, వాటి ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఇదే సంద ర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీల గురించి, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాల గురించి ప్రజలకు వివరించాలని ప్రజా మద్దతు కూడగట్టాలన్నారు. దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తుందని, యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించాలన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



ఫౌండేషన్ ద్వారా బీరువా అందిస్తున్న మనోజ్ గౌడ్

సుల్తానాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామానికి చెందిన ఓ పేదింటి యువతి వివాహాన్ని పురస్కరించుకుని ఆదివారం తాల్లపెల్లి ఆగయ్య ఫౌండేషన్ వారు ఏడువేల రూపాయల విలువ గల బీరువాను అందించి చేయూతనందించారు. నిరుపేద యువతి వివాహాన్ని పురస్కరించుకుని తమ ఫౌండేషన్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 226 మంది నిరుపేద యువతుల వివాహానికి ఏదో విధంగా ఇలాంటి సహాయ సహకారాలు అందించామని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాల్లపల్లి మనోజ్ గౌడ్ తెలిపారు. నిరుద్యోగ యువతకు, క్రీడాకారులకు ఆర్థికంగా చేయూతనందించానని, నిరుపేదల ఆపద సమయంలో ఎలాంటి సహాయం కోసమైనా తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని మనోజ్ గౌడ్ సూచించారు. మంచరామి గ్రామంలో సౌమ్య పెళ్లి సందర్భంగా బీరువాను అందించిన కార్యక్రమంలో ఆదివారం మాజీ ఎంపీపీ పాల రామారావు, ఓదెల మల్లన్న టెంపుల్ మాజీ డైరక్టర్ కర్రె కుమారస్వామి,పూరెళ్ల శ్రీనివాస్, గట్టయ్య భానుప్రకాష్, ఎల్లస్వామి, శేఖర్, లక్ష్మన్,చంద్రమౌళి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ధర్మారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి పుట్టినరోజు సందర్భంగా ధర్మారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి గుట్టపైకి శనివారం భక్తులు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని ధర్మారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి మొదలైన రథోత్సవం బస్టాండ్ నుంచి చౌరస్తా మీదుగా గ్రామమంతా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు.

ఆవోపా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కు సన్మానం



పల్లా సురేష్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ భానుప్రసాదరావు

సుల్తానాబాద్, ఆగస్టు 10: (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సుల్తానాబాద్ పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్‌ను ఎమ్మెల్సీ భానుప్రసాదరావు అభినందిస్తూ సత్కరించారు. పల్లా సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చక్రధర్ రావు, సుల్తానాబాద్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు నామిని రాజిరెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు కోడం అజయ్, రాజేశ్వర్ రావు, గుండా మురళి,మాజీ ఎంపీటీసీలు ఫకీర్ యాదవ్, మీస సత్తన్న, సుద్దాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కొమురవెల్లి కాశీపతి సుల్తానాబాద్ యూనిట్ ఆవోపా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రామిడి రవీందర్, కోశాధికారిగా కొమురవెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీరిని వాసవిమాత ఆలయంలో ఘనంగా సన్మానించారు.

సాగునీరు అందించాలి

సైదాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్‌తో కలిసి వెన్నంపల్లి, సోమారం శివారులో కాకతీయ కాలువను పరిశీలించారు.

పెద్దపల్లిలో బస్ డిపో నిర్మాణం

● పూర్తయిన టెండర్లు, ఒప్పందాలు ● త్వరలో మొదలు కానున్న పనులు ● సంక్రాంతికి ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే



ఆర్టీసీ బస్సులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా కేంద్రానికి మంజూరైన ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి సంబంధించిన టెండర్లు, ఒప్పందాలు పూర్తి కాగా, త్వరలోనే పనులు ఆరంభం కానున్నాయి. ప్రతిపాదిత స్థలంలో గల పౌరసరఫరాల గోదాం, ఇతర భవనాల్లో కొన్నింటిని వదిలేసి మధ్యలో ఉన్న భవనాలను కూల్చి వేయనున్నారు. మొత్తం స్థలాన్ని చదును చేసి సిమెంట్ రోడ్లు, షెడ్ల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టనున్నారు. డిపో నిర్మాణ పనులకు ఈ ఏడాది జనవరి 17వ తేదీన 11 కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ టీజీఎస్ఆర్టీసీ ఉన్న తాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత నెలలో పనుల కోసం టెండర్లను ఆహ్వానించినప్పటికీ, ఇక్కడ డిపో నిర్మాణ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో మరోసారి టెండర్ నోటీస్ జారీ చేశారు. 6.25 కోట్ల రూపాయలతో సివిల్ పనులు, 5 కోట్లతో ఎలక్ట్రికల్, ఇతర పనులకు టెండర్లు పిలిచారు. ఎట్టకేలకు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో ఆర్టీసీ సంస్థ వారితో ఒప్పందాలు కుదుర్చుకున్నది. గురువారం ఆర్టీసీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు పెద్దపల్లికి వచ్చి ప్రతిపాదిత స్థలాన్ని మరోసారి పరిశీలించి వెళ్లినట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలనే ప్రజల చిరకాల నెరవేర్చేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లికి బస్ డిపో మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. ఈ మేరకు ప్రభుత్వం అందుకు అంగీకరించడంతో బస్టాండ్‌కు సమీపంలో బస్ డిపోకు 4.31 ఎకరాల భూమిని కేటాయిస్తూ సెప్టెంబర్ 26న తేదీన జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ నంబర్. ఈ1/1629/2024 ఉత్తర్వులు జారీ చేశారు. సర్వే నంబర్ 592లో 36 గుంటల స్థలంలో గల సివిల్ సప్లయ్ గోదాం, సర్వే నంబర్ 589లో 6 గుంటల స్థలంలో గల ఎంపీడీఓ, 7 గుంటల్లో గల ఎంఇఓ, 7 గుంటల్లో గల డీఆర్‌డీఏ ఆఫీసులు, 3 గుంటల్లో గల సివిల్ సప్లయ్ కార్యాలయం, 4 గుంటల్లో గల పాడి రైతు శిక్షణ కేంద్రం, 12 గుంటల్లో గల జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయం, 14 గుంటల్లో గల మిల్క్ యూనిట్ కార్యాలయం, 5 గుంటల్లో గల ఎక్సైజ్ కార్యాలయం, 18 గుంటల్లో గల పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం, 3 గుంటల్లో గల డీఎల్‌పీఓ కార్యాలయం, ఎకరం 36 గుంటల ఖాళీ స్థలాన్ని బస్ డిపో కోసం కేటాయించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పౌరసరఫరాల గోదాం గల 4.31 ఎకరాల భూమి ఆర్టీసీకి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. డిసెంబర్ 4న పెద్దపల్లి పట్టణంలో జరిగిన సీఎం యువవికాసం సభకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక రోజు ముందే డిపో మంజూరు ఉత్తర్వులు జారీ చేసి సభ రోజున సభాస్థలి నుంచి వర్చువల్‌గా బస్ డిపోకు శంకుస్థాపన చేశారు. వచ్చే సంక్రాంతికి బస్ డిపోను ఆరంభిస్తామని ఇప్పటికే పలు వేదికలపై పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రకటించిన విషయం తెలిసిందే.

నేడు మండలంలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథనిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం పర్యటించనున్నట్లు స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయం ఆదివారం తెలిపింది. మండలంలోని చిల్లపల్లి గ్రామంలో 5 ఎకరాల్లో రూ. 6.93 కోట్లతో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేయనున్న 2 గోదాములకు శంఖుస్థాపన, గుంజపడుగు గ్రామం వద్ద రూ. 2.90 కోట్లతో పీఎం కుసుమ్ పథకంలో మంథని ప్రాథమిక సహకార సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్‌కు మంత్రి శ్రీధర్‌బాబు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు.

బలహీన వర్గాల దిక్సూచి శివశంకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల దిక్సూచి దివంగత కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ అని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. ఆదివారం ముకాస విద్యార్థి వసతి గృహం లో నిర్వహించిన శివశంకర్ 96వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం హరి శంకర్ మాట్లాడుతూ శివశంకర్ పట్టుదల, అవిరళ కృషి, కార్యదీక్ష వల్లే ఉమ్మడి రాష్ట్రంలో ఆ తర్వాత జాతీయ స్థాయిలో బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు

పూలన్‌దేవీ, శివశంకర్ జయంతి

మంథని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ పూలన్‌దేవీ, మాజీ కేంద్ర మంత్రి శివశంకర్‌ల జయంతి ఉత్సవాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహనీయుల చౌక్ వద్ద వారి ఇద్దరి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శివశంకర్ విగ్రహ ఏర్పాటు కోసం పుట్ట మధు భూమి పూజ చేశారు. వారు చేసిన సామాజిక సేవలను కొనియాడారు. వారి స్ఫూర్తితో సమాజ సేవలో తరలించాలని పుట్ట మధు పిలుపునిచ్చారు. మాజీ గవర్నర్‌గా, కేంద్ర మంత్రిగా, సుప్రీం కోర్టు న్యాయవాదిగా బీసీ సమాజాభివృద్ధి కోసం, బీసీలకు రాజ్యాధికారం కోసం కృషి చేశారన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, పుప్పాల తిరుపతి, జంజర్ల శేఖర్, కనవేన శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పుట్ట మధు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం



అప్పన్నపేటలో ఇళ్లకు ముగ్గుపోస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు



కోనరావుపేటలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఆదివారం మండలంలోని అప్పన్నపేట, బొంపల్లి గ్రామాల్లో రూ. కోటి 10 లక్షల నిధులతో చేపట్టిన రోడ్లు, మురికికాలువలు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. అప్పన్నపేటలో నిర్మించిన మహిళా సంఘ భవనం, అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించి ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యం అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్తగా రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ.10 లక్షల పెంపు, ధాన్యం కొనుగోళ్లలో కటింగ్ లేకుండా కొనుగోలు, సన్న వడ్లకు రూ. 500 బోనస్, ఇసుక సులభతరం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముంగిటకు తీసుకు వచ్చామన్నారు. మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీలత, సంపత్, ఏపీఎం , సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్ ,సింగిల్ విండో సీఈవో తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఆరె సంతోష్, సందనవేణి రాజేందర్,కలబోయిన మహేందర్,నూగిళ్ల మల్లయ్య, ఏడెల్లి శంకరయ్య , బొంకురి అవినాష్, ముత్యాల నరేష్, జడల రాజు,వీరేశం, రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

పేదల కలలు నిజం చేస్తున్న కాంగ్రెస్

జూలపల్లి: నిరుపేద ప్రజల సొంతింటి కలలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమనారావు అన్నారు. మండలంలోని కోనరావుపేట గ్రామంలోని ఆవుల ఐలమ్మకు చెందిన ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశాన్ని ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమనారావు స్థానిక నాయకులతో కలిసి చేశారు. నాయకులు లోక జలపతిరెడ్డి, లోక దామోదర్‌రెడ్డి, జూలపల్లి తాజా మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహాయాదవ్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టంలో చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి ఆమోదం కోసం పంపినా ఇప్పటి వరకు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సమాన అవకాశాల కల్పన కోసం రిజ ర్వేషన్ బిల్లును పక్కన పెడుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రిజర్వేషన్ల గురించి మాట్లాడకుండా తెలంగాణలో మత ప్రాతిపదికన ప్రజలను విభజించడం కోసం రిజర్వేషన్లను మతానికి పరిమితం చేస్తున్నారన్నారు. తెలంగాణలో బీజేపీ విద్వేష రాజకీయాలకు బీజం వేస్తుందని, బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి చేస్తున్న సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తూ జైల్లో పెడుతున్నారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యం రావు, వేల్పుల కుమారస్వామి, తుమ్మల రాజిరెడ్డి, మహేశ్వరి, మెండె శ్రీనివాస్, శైలజ, బిక్షపతి, నాగమణి, అంజలి, రజియా సుల్తానా, సమ్మక్క, షైముదా, రాము, సాగర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు సుడా వాణిజ్య సముదాయానికి శంకుస్థాపన

- హాజరుకానున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్ టౌన్ సమీపంలో సుడా వాణిజ్య సముదాయ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరవుతారన్నారు. రెండు దశల్లో నాలుగు కోట్ల రూపాయలతో సుడా వాణిజ్య సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

ఖనిలో ఘనంగా పోచమ్మ బోనాలు



బోనం ఎత్తుకున్న మనాలీ ఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా కొత్తకూరగాయల మార్కెట్ వ్యాపారుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ చౌరస్తాలో బోనం ఎత్తుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, తాళ్లపల్లి యుగంధర్ వ్యాపారులు పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ : గోదావరిఖని పట్టణంలో ఆదివారం సాయంత్రం మక్కాన్‌సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలీ ఠాకూర్ రక్ష బంధన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిరు వ్యాపారికి రాఖీ కడుతున్న మనాలీ

సింగరేణి కార్మిక సమస్యలపై ఉమ్మడి పోరు

● ఏకమైన జాగృతి, హెచ్ఎంఎస్ ● ఆరుగురితో స్టీరింగ్ కమిటీ ● కార్మికుల సమస్యలపై 14న సింగరేణి భవన్‌కు



మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

గోదావరిఖని ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్), సింగరేణి జాగృతి ఏకమయ్యాయి. సింగరేణి కార్మిక సమస్యలపై కలిసి పనిచేసేందుకు రెండు సంఘాలు నిర్ణయించుకు న్నాయి. ఆదివారం హైదరాబాద్ హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియజ్ అహ్మద్, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కలిసి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ ఇద్దరు నేతలతో పాటు హెచ్ ఎంఎస్, జాగృతి నుంచి సింగరేణి వ్యాప్తంగా వంద మంది ప్రతినిధులు హాజరై రెండు వర్గాలు సింగరేణిలో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు కవిత,రియాజ్ అహ్మద్ ఉమ్మడిగా ప్రకటన కూడా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో ఏర్పడిన రాజకీయ ప్రకంపనలు సింగరేణి దాకా పాకాయి. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలుగా ఉన్న కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను టీబీజీకేఎస్‌కు ఇన్‌చార్జిగా నియ మించడంపై కవిత వెంటనే ప్రతిస్పందించారు. ఆ ప్రకంపనే హెచ్ఎంఎస్, జాగృతి ఏకమయ్యేందుకు భూమిక అయ్యింది. సింగరేణిలో తనకున్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు, మరింత విస్తరించేందుకు కవిత జాతీయ సంఘమైన హెచ్ఎంఎస్‌తో దోస్తీ కట్టింది. రియాజ్ అహ్మద్ సైతం సింగరేణిలో మరింత తన యూనియన్ బలోపేతం చేసుకోవడానికి జాగృతితో దోస్తికి సిద్ధపడ్డాడు. ఈ రెండు వర్గాలు కలిసి పని చేయడానికి ఉమ్మడి కార్యాచరణను కూడా వెంటనే ఏర్పాటు చేసుకున్నారు. జాగృతి నుంచి ముగ్గురు, హెచ్ఎంఎస్ నుంచి ముగ్గురు ప్రతినిధులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. హెచ్ఎంస్ నుంచి శ్రీరాం పూర్‌కు చెందిన తిప్పారపు సారయ్య, భూపాలపల్లి నుంచి పంతం రాజబాబు, ఆర్‌జీ-3 నుంచి శాంతిస్వరూప్‌లు ఈ స్టీరింగ్ కమిటీలో సభ్యులు కాగా జాగృతి నుంచి గోదావరిఖనికి చెందిన ఎల్ వెంకటేష్, రత్నాకర్‌రెడ్డి, భూపాలపల్లి నుంచి నరేష్ నేత స్టీరింగ్ కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ స్టీరింగ్ కమిటీ రెండు సంఘాల సమన్వయానికి పనిచేస్తుంది. కాగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇన్‌కం టాక్స్ రద్దు, సొంత ఇంటి కల, మెడికల్ బోర్డులో జరుగుతున్న అవినీతిలు తదితర అంశాలపై రియాజ్ అహ్మద్, కల్వకుంట్ల కవిత ప్రతి నిధులతో కలిసి ఆగస్టు 14న సింగరేణి సీఎండీ బల రాంకు డిమాండ్‌ను వినిపించాలని నిర్ణయించారు. ఆగస్టు 30, 31తేదీల్లో శ్రీరాంపూర్‌లో జరిగే హెచ్ ఎంఎస్ మహాసభల్లో ఏర్పడే కమిటీలో డివిజన్ సాయి నుంచి కేంద్ర కమిటీ వరకు జాగృతి ప్రతినిధులకు కూడా కమిటీలో భాగస్వామ్యం ఉండే విధంగా తీర్మాణం చేసుకున్నారు. ఈ సభలకు కల్వకుంట్ల కవిత హాజరు కానున్నారు. సెప్టెంబర్ మాసంలో కవిత, రియాజ్ నాయకత్వంలో సింగరేణిలోని బొగ్గు బావులు, ఓపెన్‌కాస్టులపై పర్యటించి కార్మిక సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయడానికి నిర్ణయం తీసుకున్నారు.

ఎల్ఎండీకి సందర్శకుల తాకిడి

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు వచ్చిందంటే చాలు కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయం సందర్శకులతో కళకళలాడుతోంది. ఎల్ఎండీలో ప్రస్తుతం నీళ్లు తక్కువగా ఉన్నాయి. డ్యాం పరిసరాలు పచ్చిక బయళ్లతో అందంగా కనిపిస్తున్నాయి. గాలికి వచ్చే అలలు బీచ్‌ను తలపిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ ప్రాంతాన్ని కరీంనగర్ బీచ్ అంటూ వైరల్ చేయడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ ప్రాంతం ఓ పిక్నిక్ స్పాట్‌గా మారింది. సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున వాహనాల్లో తరలివస్తున్నారు. యువత వాహనాలను డ్యాం లోపలికి దింపి విన్యాసాలు చేస్తున్నారు. కొన్ని వాహనాలు ఇరుక్కు పోవడంతో ఎక్స్‌కావేటర్లతో తొలగించారు. కొన్నిసార్లు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవు తున్నాయి దీంతో పోలీసులు అప్రమత్తమై వాహనాలను అసలు కట్టపైకి రానివ్వ కుండా కట్టడి చేశారు. డ్యాంలో నీటి లోతు ఎక్కడ ఎలా ఉందో తెలియని పరిస్థితి. డ్యాంలో ప్రమాదవశాత్తు పడి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా కొందరు సందర్శకులు పట్టించుకోవడం లేదు.